# బంధం

**జగదీష్ అద్దంలో తన ముఖం చూసుకున్నాడు. రోజూ అద్దంలో తన ముఖాన్ని చూసుకుంటూనే వుంటాడు. కాని ఆరోజు ప్రత్యేకంగా తన అనాకారితనం స్పష్టంగా కనిపించింది. చాలా బాధపడిపోయాడు.**

అద్దంమీద కోపం వచ్చింది ఎందుకనో?! కాని... మళ్ళీ అనుకొన్నాడు-

"ఇందులో అద్దం తప్పేముంది? అద్దం అబద్ధం చెప్పదు. తన రూపాన్నే అద్దం చూపిస్తుంది" అని!

"నేనెందుకు ఇలా వున్నాను? చెల్లెళ్ళిద్దరూ తెల్లగా, అందంగా వుంటారు. అమ్మ చాలా అందంగా వుంటుంది. నాన్నగారు కూడా తెల్లగా, బాగానే వుంటారు. మరి నేను ఇలా నల్లగా, ఎత్తుపళ్ళతో వున్నానేమిటి?" అనుకొన్నాడు.

ఎప్పుడు అద్దం చూసినా అలానే అనుకుంటాడు. అనుకుని బాధపడిపోతాడు.

జగదీష్ గీతమ్ కాలేజీలో ఇంజనీరింగ్ ఫైనల్ఇయర్ చదువుతున్నాడు. కాలేజీకి వెళ్ళినా ఎవరితోనూ మాట్లాడడు. ఎక్కువగా తన చదువు, తన పుస్తకాలు, తన క్లాసులు... ఎవరితోనూ ఎక్కువగా కలవడు. క్రమక్రమంగా అతనిలో ఆత్మన్యూనతా భావం చోటుచేసుకోసాగింది. కాని పైకి మామూలుగానే వుంటాడు.

ఎప్పుడైనా జగదీష్ ఒంటరిగా కూర్చుంటే కవిత వస్తుంది. మంచి మాటలు చెప్పి వంటరితనాన్ని పోగొట్టి అతన్ని నవ్వించడానికి ప్రయత్నిస్తుంది. కవిత అతన్ని పూర్తిగా అర్థం చేసుకుంది. వాళ్ళిద్దరివీ ఎం.వి.పి. కాలనీలో పక్కపక్క ఇళ్ళే. జగదీష్ ఇంట్లో అందరూ కవితకి బాగా తెలుసు. జగదీష్ మనసు అంతకంటే బాగా తెలుసు ఆ అమ్మాయికి.

"జగదీష్! నువ్వు ఒంటరిగా గిరిగీసుకుని ఎందుకు వుండిపోవాలని అనుకుంటావు? నీ గురించి నువ్వు ఏమనుకుంటున్నావో నాకు బాగాతెలుసు జగదీష్! కాని నువ్వు ఇలా చెయ్యడం ఏమీ బాగాలేదు. నేను బాహ్య సౌందర్యం కంటే హృదయ సౌందర్యానికి ఎక్కువ ప్రాధాన్యతనిస్తాను. నీలో వున్న ఇన్ఫీరియారిటీ కాంప్లెక్స్‌ని దూరం చేసుకో ముందు. చాలా మందికంటే నువ్వు ఎంతో ఉన్నతంగా వున్నావు! నీకేం తక్కువ! మంచి మనసుంది. అది చాలు" అని అతనికి దగ్గరగా కూర్చుని మాటల్లో పిసరంత ఓదార్పుని కలిపి మెత్తగా అంటుంది.

జగదీష్ హృదయం కరిగిపోతుంది. ఆమాత్రం ఓదార్పుకే అతనికి కవిత అంటేచాలా ఇష్టం. అప్పుడప్పుడు వుడాపార్కులో, రామకృష్ణా బీచ్‌లో వాళ్ళిద్దరూ కలుసుకుని అలా కొంతసేపు మాట్లాడుకునే వారు.

కవిత ఒకరోజు వాళ్ళ మేనత్తగారి ఊరు వెళ్ళింది. ఆరోజు రామకృష్ణా బీచ్‌లో జనాలకి దూరంగా ఒంటరిగా కూర్చున్నాడు జగదీష్. ఏదో ఆలోచిస్తూ అలా చాలాసేపు కూర్చుండిపోయాడు. సడన్‌గా

ఆలోచనల్లోంచి బయటపడేసరికి బాగా చీకటి పడిపోయింది. వర్షం వచ్చే సూచనగా ఆకాశంలో అక్కడక్కడా చిన్నచిన్న మెరుపులు మెరుస్తున్నాయి. ఈదురుగాలి ఈడ్చికొడ్తున్నది!

ఉన్నట్టుండి భయంకరంగా ఉరిమింది ఆకాశం. సన్నగా చినుకులు మొద లయ్యాయి. క్రమక్రమంగా చినుకులు పెద్దవై వర్షం ఉధృతంగా పడడం మొదలైంది.

జగదీష్ పూర్తిగా తడిసిపోయాడు. ఆకాశం మరొకసారి భయంకరంగా ఉరిమింది. రోడ్లన్నీ ఆ వర్షానికి బురద - బురద అయిపోయాయి. అల్లంత దూరంలో ఇల్లు కనిపించగానే ప్రాణం లేచివచ్చింది జగదీష్‌కి.

స్కూటరుకి స్టాండువేసి గేటు తలుపు తీస్తున్న జగదీష్‌కి గేటు బయట చీకట్లో ఎవరో వ్యక్తి తచ్చాడుతున్నట్టు అనుమానం వచ్చింది. గేటు తీసుకుని లోపలికి వెళ్ళినట్టుగానే వెళ్ళి ఒక వారకి నించుని ఆ వ్యక్తిని గమనించసాగాడు జగదీష్. వీధి వసారాలో వున్న లైటుకాంతి అప్పుడప్పుడు ఆ వ్యక్తిమీద పడుతున్నది...

నల్లటి శరీరం, మాసిన గడ్డం, చింపిరి జుట్టు, ఎర్రబడి లోతుగా వున్న కళ్ళు, నల్లటి ఫాంటు మీద నలిగిపోయి, మాసిపోయిన తెల్లటి షర్టు... బక్కచిక్కినట్టున్న ఆ వ్యక్తిని స్పష్టంగా చూడగల్గుతున్నాడు జగదీష్.

ఆ వ్యక్తి కొంతసేపు అటూ - ఇటూ తచ్చాడి గేటు తీసుకుని లోపలికి రాబోతూ మళ్ళీ గేటు వేసేసి అవతలకి వెళ్ళి నించున్నాడు.

ఇదంతా చాటునించి గమనిస్తున్న జగదీష్‌కి ముచ్చెమటలు పోశాయి!

ఎవరా వ్యక్తి? దొంగకాదు కదా!... దొంగలా లేడు!

అయితే మరెవరు? ఏం కావాలి అతనికి? ఎందుకలా గేటు దగ్గరే తచ్చాడు తున్నాడు? దేనికో సంశయిస్తున్నట్టుగా వుంది అతని వాలకం చూస్తుంటే.

జగదీష్ ధైర్యంచేసి కొంచెం ముందుకు వచ్చాడు. ఆ వ్యక్తి ఇంకా... అక్కడే వున్నాడు!

"ఎవరికోసం?" దగ్గరకు వెళ్ళి ప్రశ్నించాడు జగదీష్ ఆ వ్యక్తిని. అతడు జగదీష్‌ని ఎగాదిగా చూశాడు ఒక్క క్షణం. జవాబివ్వలేదు.

"ఎవరు కావాలి... అంటే జవాబివ్వరేంటి? మిమ్మల్నే అడిగేది. మీరు ఎవరు అసలు?" నిలదీస్తున్నట్టుగా అడిగాడు జగదీష్.

"నువ్వు... నువ్వు ఎవరుబాబూ! అన్నపూర్ణ కొడుకువా?" ఎదురు ప్రశ్న వేశాడు అతను.

గతుక్కుమన్నాడు జగదీష్. ఇతనికి అమ్మపేరు ఎలా తెల్సు? చూస్తే బికారి వాడిలాగా ఉన్నాడు. కాని భాష స్పష్టంగా ఉంది. ఉచ్చారణ బాగుంది.

"మీకు ఆవిడ... తెలుసా?" ఆశ్చర్యంగా అడిగాడు జగదీష్, తనెవరో చెప్పకుండానే!

"హుఁ! తెలుసా... అని మెల్లగా అడుగుతున్నావా బాబూ! బాగా తెలుసు."

"ఎలా తెలుసు? మీరు చూస్తే..." అతని అవతారం చూసి అసహ్యంగా మొహంపెడ్తూ అన్నాడు.

"నా వేషం చూసి నువ్వు అలా అనుకోవడంలో పొరపాటేంలేదు బాబూ! అన్నపూర్ణ నాకు బాగా తెల్సు. మొదట్నించి జరిగినదంతా నీకు చెప్తాను. కాని నువ్వు నాకొక్క సహాయం చెయ్యాలి. చెయ్యగలవా?"

"చెప్పండి. నాకు చేతనైతే చేస్తాను" అన్నాడు.

★ ★ ★

అదంతా దాదాపు రెండు పుష్కరాల నాటి గాథ.

అయినా సరే; చెప్పేవాడికి బాగుండదు; చెప్పవలసిన సమయం వచ్చింది. చెప్పుకుంటే వినేవాడు దొరికేడు......

దివాకర్, అన్నపూర్ణ- కాలేజ్‌మేట్స్, అతను ఫైనలియర్ డిగ్రీ. ఆమె సీనియర్ ఇంటర్.

అప్పట్లో "కాలేజ్ బ్యూటీ"లాంటి బిరుదులూ నిక్ నేమ్సూ అంత ఉధృత ప్రచారంలో లేవు గాని; ఉండివున్నట్లయితే వాటన్నిటికీ తగిన శరీర నిర్మాణం, అవయవాల సొరు- అన్నపూర్ణవి.

దివాకర్ చిన్ననాటినుండీ క్లాసుఫస్టు, స్కూల్ ఫస్టు, కాలేజి ఫస్టు స్టూడెంటు. ఇంటర్‌లో స్టేట్ ఫస్టే. ఇంజనీరింగ్ మీద క్రేజ్ ఇంకా పాదుకోని రోజులు, బి.ఎస్సీ చదివి ఎమ్మెస్సీ చేసి సైంటిస్టు అవాలని అతని ప్రణాళిక. చదువుమీద శ్రద్ధ ఎంత బలీయం అంటే మిగిలిన వ్యక్తులలో ఉండే సునిశిత భావాలూ సున్నితమైన ఆలోచనలూ అంటనంత. తాను అనాకారి అనీ, నల్లటి దేహానికి మరింత వికృతత్వం తెచ్చే తెల్లటి ఎత్తైన పలువరుస తన అనాకారితనాన్ని మరింత గుణీకృతం చేసిందనీ స్పృహలోకి రానివ్వనంత.

అందుచేతనే, దివాకర్, "అన్నపూర్ణా! నువ్వంటే నాకిష్టం. నీకు కాలేజీ బ్యూటీ అని టైటిలు ఎవరూ ఇవ్వకపోయినా నీ సౌందర్యం గొప్పది. మేలుకున్నా, నిద్రపోయినా, కలలు కన్నా నువ్వే నా కళ్లెదుట ఉంటున్నావు. నాకు మంచి కెరీరు ఉంది. నిన్ను సామాజికంగా, ఆర్థికంగా- సుఖపెట్టగలిగేటంత ఉద్యోగం నాకు వస్తుంది. సో- నువ్వు నన్ను పెళ్ళి చేసుకో," అని అడగ గలిగేడు.

అందుచేతనే, అన్నపూర్ణ తనని అనాకారి అనీ, నల్ల తుమ్మమొద్దు అనీ, ఎత్తు పళ్ళ ఎద్దు స్వరూపం అనీ తూలనాడి తిరస్కరించినా, ఆమెమీది కాంక్షను తొక్కిపెట్టలేక పోయాడు.

అందుచేతనే; జూనియర్స్ అండ్ సీనియర్స్‌తో లెక్చరర్స్ ఏర్పాటు చేసిన ఆ భారీ పిక్నిక్‌నాడు అన్నపూర్ణ ఒంటరిగా దొరకగానే ఆమెకి బస్సు తప్పించేసి వాన నెపంమీద ఆ తోట బంగళాలోకి తీసుకుపోయి ఆమె ఏడ్చి మొత్తుకున్నా రక్కీ, గుద్దీ హింస పెట్టినా లక్ష్యపెట్టక తను ఉద్దేశించిన అనుభవాన్ని బలాత్కారంగా కసిగా పొందేడు.

ఆ సంఘటన జరిగిన నలభై రోజులకి అన్నపూర్ణకి పెళ్లి కుదిరిందనీ వారం రోజుల్లో ముహూర్తం అనీ తెలిసేక ఆమె ఒక స్నేహితురాలి ఇంటికి వెళ్లిన సందర్భం చూసి ఆమె చేతిలో చీటీ పెట్టేడు. "ఇప్పటికైనా మించి పోయింది లేదు. నీకూ నాకూ మధ్య ఉన్న రహస్యాన్ని పెద్దలకి చెప్పేసి నీ పెళ్లి నాతో ఖాయం చేయించుకో. నాకిప్పుడు నీమీద ప్రేమ రెట్టింపై ఉంది. మొన్నటి తోట బంగళా

అనుభవం వల్ల నీకు గర్భం వస్తే ఆ పుట్టబోయే బిడ్డని నేను చూసుకునేంత దయగా ఈ నీ కాబోయే భర్త చూడడు."

ఆ తరవాత వారంలో ఆ పెళ్లి జరగలేదు. ఒకనెల వాయిదా పడింది. ఈలోగా గర్భం నిర్ధారణ అయింది. అన్నపూర్ణ కంగారు పడింది. పనిమనిషి ఆరాతీసింది. గుట్టుచప్పుడు కాకుండా ఎబార్షన్ చేయించేస్తాననీ ఖర్చు అయిదు వందలవుతుందనీ నచ్చజెప్పి ఆ ఐదువందలూ అడగడానికి దివాకర్ దగ్గిరికొచ్చింది. "ఈ బాధంతా పడే బదులు ఆ అమ్మాయి నన్నే పెళ్లి చేసుకోవచ్చు గదా" అన్నాడు దివాకర్. "అదే మంచిది బాబూ, తమకేటి తక్కువ!- ఎల్లి మాటాడదాం రండి. నేను మీ తరుపు నుంటాను." అంది పనిమనిషి.

★ ★ ★

దివాకర్ చెప్పుకుపోతున్నాడు:

"ఆనందం పట్టలేకపోయాను. పూర్ణని నాకిచ్చి పెళ్ళిచేస్తారని చాలా ఆశపడ్డాను. కాని, తన మాటలు పట్టించుకోకుండా, గుట్టుచప్పుడు కాకుండా పూర్ణ పెళ్ళి క్రిష్ణమూర్తితో జరిపించేశాడు వాళ్ళన్నయ్య! పెళ్ళయిన ఏడవ నెల్లోనే మగ పిల్లవాడు పుట్టాడు. కొంతమంది ఏడవనెలలోనే పుడతారు! ఆ విధంగానే పుట్టాడని, తన కొడుకేనని మురిసిపోయాడు ఆ కృష్ణమూర్తి! కాని... వాడు... వాడు... నాకొడుకు! నారక్తం పంచుకు పుట్టిన కొడుకు! నా నీడకూడా వాళ్ళమీద పడకుండా జాగ్రత్తపడ్డాడు వాళ్ళన్నయ్య. తొందరపాటుతనంతో పెద్దతప్పే చేసేను నేను. కాని ఆ తర్వాత... నా తప్పుని సరిదిద్దుకోవడానికి అవకాశం కోసం ఎదురుచూశాను. పూర్ణని మర్చిపోలేకపోయాను. నేను మరి పెళ్ళిచేసుకోలేదు. పూర్ణ అన్నయ్యకి నామీద పీకలదాకా కోపం వుంది. కనిపిస్తే నన్ను చంపేస్తాడని తప్పించుకు తిరిగాను చాలా రోజులు! మా అమ్మానాన్నా రైలు ప్రమాదంలో పోయారు. ఎవరూ లేరు. నాకు సైంటిస్టు ఉద్యోగం దొరకలేదు. ఏదో పొట్ట నింపుకోవడానికి చిన్న ఉద్యోగం దొరికింది. నేను చేసిన తప్పుకి నా మనసు నన్ను అనుక్షణం చిత్రవధ చేస్తూనే ఉంది. తాగుడు అలవాటై శనిలా పట్టుకుని, నా వళ్ళు గుల్లయింది. జీవితం అంధకార మయమైపోయింది. అయితే ఇంత బాధలోనూ ఒకే ఒక తృప్తి! అన్నపూర్ణ సుఖంగా వుంది! నాకూ - పూర్ణకీ పుట్టినకొడుకు పూర్ణదగ్గరే సుఖంగా వున్నాడని... తెలిసింది. వాళ్ళ అడ్రసు కూడా నాకు తెలియకుండా తగిన బందోబస్తు చేశాడు వాళ్ళన్నయ్య. ఆఖరికి ఇన్నాళ్ళ తర్వాత... ఇన్నేళ్ళ తర్వాత వాళ్ళ అడ్రసు తెలుసుకోగలిగాను. నాకు సిరోసిస్ వచ్చిందని మరి కొద్ది రోజుల్లో జీవితాన్ని ముగించుతున్నానని డాక్టర్లు చెప్పారు! నా చివరి కోరిక... అదే ఒక్కసారి... పూర్ణనీ... నా కొడుకునీ కళ్ళారా చూసి తృప్తిగా కన్నుమూద్దామని! నేను క్షమించరాని నేరమే చేశాను. దానికి తగిన శిక్ష కూడా ఈ జీవితకాలంలోనే పూర్తిగా అనుభవించేశాను. జీవితపు చరమ దశలోనైనా కాస్తంత తృప్తి ఆ దేవుడు నాకిస్తాడేమోననే ఆశతో ఇలా ఈ ఇంటి చుట్టూ తిరుగుతున్నాను. ఒక్కసారి అన్నపూర్ణని పిలువు బాబూ! చూసి వెళ్ళిపోతాను..." ఆయాసంతో రొప్పుతున్న అతనికి ఒక్కసారిగా దగ్గు వచ్చింది. వెంటనే నోట్లోంచి రక్తం కారసాగింది.

పడవ్‌గా జగదీష్ తన చేతిరుమాలుతో అతని పెదవులకంటిన రక్తాన్ని తుడిచాడు. ఆ బంధం

అలాంటిది మరి! తనతో మాట్లాడిన వ్యక్తి ఫలానా అని తెలిసి, అనాలో చితంగా ఆ క్షణంలో వశం తప్పాడు.

స్కూటరు చప్పుడు వినిపించినా ఎంతసేపటికీ జగదీష్ లోపలికి రాకపోవడంతో, ఏవో మాటలు వినిపించి అన్నపూర్ణ ఇవతలికి వచ్చింది. మెట్లు దిగి గేటుదగ్గరకు వచ్చి చూసింది అన్నపూర్ణ!

"జగ్గూ! ఏమయింది? ఎవరతను? ఇంతసేపు ముక్కూ-మొహం తెలీని వాళ్ళతో ఆ మాటలేంటి? అసలే నాన్నగారు ఊర్లో లేరు. చీకటి పడిందంటే భయంగా ఉంటోంది!'' అటూ-ఇటూ చూస్తూ అంది ఆవిడ.

ఆవిడ తల్లోంచి మల్లెపూల వాసన గుబాళించింది. కట్టుకున్న వెడల్పంచు ఎర్రటి జరీచీర ఆమెకు నిండుదనాన్ని చేకూరుస్తున్నది. వచ్చిన వ్యక్తి రెప్పార్పకుండా ఆమె వైపే చూస్తున్నాడు. అతని నోటినుండి నాటుసారా వాసన గుప్పుమని వస్తున్నది! అన్నపూర్ణని చూసి తన్మయత్వం చెందినట్టుగా అలా వుండిపోయాడు ఆ వ్యక్తి.

"నేను... నేను... దివాకర్‌ని" అతని పెదవులు అస్పష్టంగా గొణుగుతున్నాయి.

ఆమె అతన్ని పోల్చుకోలేదు. దివాకర్ అనేపేరు ఎప్పుడో ఆమె మనోపథం నుండి చెరిగిపోయింది. "ఏ దివాకర్? ఏ వూరు?"

దివాకర్ నెమ్మదిగా పిల్చాడు మళ్లీ "పూర్ణా...'' అని. బాగా దట్టంగా పెరిగిన గడ్డం, మాసిపోయిన దుస్తులు, శిథిలమైన శరీరంతో అచ్చు తాగుబోతులా వున్న అతన్ని చూసి గుర్తుపట్టలేకపోయింది అన్నపూర్ణ. ఒకసారి అతని ఎగాదిగాచూసింది.

"అమ్మా! ఈయన... దివాకర్... అని... నీకు చిన్నప్పుడు బాగా తెలుసట! నిన్ను చూడ్డానికి, నిన్ను వెతుక్కుంటూ ఇంత దూరంవచ్చారు!'' కొడుకు మాటలకి ఆమె షాక్‌కొట్టిన దానిలా ఉండిపోయింది. ఆమెకి తన కాళ్ళక్రింద భూమి రెండు చీలికలైపోయినట్టు అనిపించింది. జీవితంలో మళ్ళీ ఇలాంటి సన్నివేశం ఎదురవుతుందని ఆమె కలలో కూడా ఊహించలేదు! గబుక్కున వెనక్కి తిరిగి లోపలికి వెళ్ళిపోబోతుంటే జగదీష్ అడ్డుపడి ఆపాడు.

"అమ్మా! ఈయన... నీకు బాగా కావల్సిన వ్యక్తట. పాపం అతని ఆరోగ్యం పూర్తిగా దెబ్బతిన్నది. డాక్టర్లు ఆయన ఎక్కువ రోజులు బ్రతకరని చెప్పార్ట. నిన్ను... చివరిసారి... చూడ్డంకోసం ఇంత దూరం... వచ్చార్ట'' జగదీష్ మాటలు ఇంకా పూర్తికాక ముందే,

"వద్దు, వద్దు, వీల్లేదు'' పిచ్చిదానిలా అరిచింది, అన్నపూర్ణ.

"అమ్మా! పశ్చాత్తాపానికి మించిన శిక్ష లేదంటారు. ఆయన పశ్చాత్తాపంతో కుమిలిపోతున్నాడు! తను చేసిన పొరపాటుకి జీవితపు చివరి ఘడియదాకా శిక్ష అనుభవిస్తూనే వున్నాడు! ఎవరికీ చెప్పుకోలేని బాధని గుండెలో దాచుకుని నరకయాతన అనుభవిస్తున్నాడు! ప్రేమించిన ఆమెని గుండె గుడిలో దేవతలా ప్రతిష్ఠించుకున్నాడు. ఆమెనే అహర్నిశలు స్మరిస్తూ ఇన్ని సంవత్సరాలు గడిపాడు! అలాంటి వ్యక్తితో మాట్లాడను అనడం మానవత్వం అనిపించుకోదు. నీలో ఆపాటి సంస్కారం వుందని నేననుకుంటున్నానింకా'' జగదీష్ మాటలు తీక్షణంగా, కటువుగా, సూటిగా,

బాణాల్లా తగిలాయి ఆమెకి. ఉబికి వస్తున్న కన్నీళ్ళతో ఆమె కళ్ళు మసకబారాయి. ఆమె దుఃఖాన్ని దిగమింగుకోవడానికి విశ్వప్రయత్నం చేస్తోంది.

అన్నపూర్ణకి కళ్ళవెంట నీళ్ళు జలజలా రాలాయి! ఆమె చేతులు వణుకుతున్నాయి. జగదీష్‌కి అంతా తెల్సిపోయిందన్న బాధ కంటే తనకొడుకు తననే తప్పుపడుతున్నాడనే బాధ ఇంకా ఎక్కువై ఆమెలో దిగులు ఏర్పడింది. తలెత్తుకోలేని పరిస్థితి ఏర్పడింది. భయం వేసింది. ఏం చెయ్యనూ పాలుపోవడం లేదు. అతను విపరీతంగా దగ్గుతున్నాడు. దగ్గుతూంటే రక్తం పడుతోంది. అదే పనిగా దగ్గడం వల్ల ఆయాసంతో అతని నోటంట మాట రావడం లేదు. హఠాత్తుగా మొదలు నరికిన చెట్టులా అతను అక్కడే కుప్పకూలి పోయాడు! జగదీష్‌కి గుండె వేగంగా కొట్టుకోసాగింది. వెంటనే ఏదో కర్తవ్యం స్ఫురించినట్టుగా తన రెండుచేతుల్తో అతన్ని లోపలికి తెచ్చి పడుకోబెట్టాడు! అన్నపూర్ణలో ఆదుర్దా ఎక్కువైంది. గబగబా లోపలికి వెళ్ళి గ్లాసుతో మంచినీళ్ళు తీసుకుని పరిగెడుతున్నంత వేగంగా ఇవతలికి వచ్చింది. అతను స్పృహ తప్పినట్టు న్నాడని తలచి జగదీశ్, తల్లి తెచ్చి నీళ్ల అతని ముఖంమీద చిలకరించి, ముక్కుదగ్గర వేలుపెట్టి చూసి షాక్ కొట్టినట్టుగా వుండిపోయాడు.

దివాకర్ పంచప్రాణాలు అప్పటికే అనంత వాయువుల్లో కలిసిపోయాయి!

తెల్లవారేసరికి చుట్టుప్రక్కల వాళ్ళంతా ఇంటిముందు గుమిగూడారు.

"ఎవరో పాపం! తీవ్రమైన అనారోగ్యంతో ఇంటి ముందు తెలివి తప్పి రాత్రివేళ పడిపోతే లోపలికి తీసుకొచ్చి అరుగుమీద పడుకోబెట్టారు పాపం!"...

"ఈ ఇంటి వాళ్ళు మంచివాళ్ళు కాబట్టి సరిపోయింది, లేకపోతే ఏమయివుండేదో?"

"ఏ ఊర్నించి వచ్చాడో? ఎక్కడివాడో? అసలు పెళ్ళాం పిల్లలు వున్నారో, లేరో?..."

"ఏమిటో! మనిషి జీవితం ఎంత విచిత్రం! పుత్రుడు పున్నామ నరకం నుండి తండ్రిని తప్పిస్తాడు అంటారు. తండ్రికి తలకొరివి పెట్టడానికి 'కొడుకు' అన్న వాడు వుండాలంటారు. అలాంటిది ఏ ఊరివాడో, ఏమిటో: ఇక్కడికొచ్చి దిక్కులేని చావు చచ్చాడు!..."

అందరూ తలో మాట అంటూంటే దుఃఖాన్ని దిగమింగుకోవడానికి విశ్వప్రయత్నం చేస్తున్నారు ఆ తల్లీ కొడుకులిద్దరూ!

ఆ తల్లీ కొడుకులిద్దరికీ నోట మాటరావడం లేదు.

పరువు - ప్రతిష్ఠల కోసం ప్రాకులాడే... ఆ ఇంటి మనుషులు... ఆ వ్యక్తికి తమకు గల "బంధం - సంబంధం" ఏమిటో ఎవరికీ నోరు తెరిచి చెప్పలేకపోయారు.

"అనాథ శవానికి దహన సంస్కారం చేస్తే బోలెడు పుణ్యం అంటారు పెద్దలు. ఆ కుర్రాడిది ఎంత మంచి మనసు! నాకెందుకని ఊరుకోకుండా ఇదంతా నెత్తినేసుకుని చేస్తున్నాడంటే నిజంగా జగదీష్ చాలా మంచివాడు!" అందరి మాటలు చెవుల్లో పడుతున్నాయి జగదీష్‌కి!

ఆఖరికి ఆ వ్యక్తి చితికి నిప్పంటిస్తున్న జగదీష్ అప్పటి దాకా ఉగ్గపట్టుకున్న దుఃఖాన్ని ఇహ ఆపుకోలేకపోయాడు!

క్రమక్రమంగా అతని హృదయపు అట్టడుగు పొరల్లో ఘనీభవించిన వేదన కరిగి - కరిగి కన్నీరుగా మారింది! అతను భోరున ఏడ్చేసి తన తల్లి చరిత్ర వినడం వలన కలిగిన భావ భారాన్ని వదిలించుకున్నాడు.

ఆ నిర్లిప్త స్థితిలో అతనికి ఒక అగోచర సత్యం స్ఫురించింది... బాహ్య సౌందర్యాన్ని చూసి ఆ తరానికి చెందిన అమ్మ స్పందించిన విధానానికీ, ఈ తరానికి చెందిన కవిత స్పందించిన విధానానికీ ఎంత తేడా ఉంది!

★ ★ ★

*(ఆంధ్రజ్యోతి, వీక్లీ; 18-8-2000)*